# ప్రేమగురుతు

- కాకాని కమల





చం (గతసంచిక తరువాయి) ద్రకళ లేడిలా లోపలికి పరిగెత్తింది. గ్లాసునిండా చల్లటినీళ్లు తెచ్చి ఆయనకి అందించింది. మళ్లీ కాఫీ కలపటానికి లోనికి వెళ్లింది.

"మీరు మళ్లీ కనిపిస్తారనుకోలేదు. భగవంతుడు దయామయుడు. మిమ్మల్ని ఇన్నేళ్ల తరువాత మళ్లీ ఇక్కడికి పంపించాడు. మీ లలిత జ్ఞాపకం వుందా మీకు?" చక్రపాణి అలవోకగా నవ్వాడు.

"ఎందుకు జ్ఞాపకం లేదూ? చంద్రకళని చూడగానే లలితనే చూసినట్లు అనిపించింది. అచ్చం అలానే ఉంది"

వర్ధని నవ్వింది. ఆరిపోయే దీపం...వెలుగులా...

"లలిత కూతురు లలితలానే ఉంటుంది కదా?"

"ఆ...!?" తుళ్లిపడ్డారు చక్రపాణి.

"అంటే!?"

"అవును. మీరు మా విధవ ఆడపడుచు లలితని ప్రేమించారు. రహస్యం ప్రణయం— పెళ్లి... మీ ఇద్దరిమధ్య ఏదేదో... ఎంతెంతో...జరిగింది. కానీ లలిత గర్భవతి అని తెలిసి జాడ లేకుండా వెళ్లిపోయారు. అవి నేను కాపరానికి వచ్చిన తొలిరోజులు. నాకు అంత లోకం జ్ఞానం లేదు. బాధ్యత తెలియని వయసు. నేను లలిత ఇంచుమించు ఒకే ఈడువాళ్లం. ఇంట్లో పెద్దవాళ్లు లేరు. లలిత భర్త పోయిన స్త్రీ. రహస్యంగా మీతో ప్రేమలోపడి గర్భవతి అయ్యింది. మీకే ఇచ్చి పెళ్లిచేద్దాం అనుకున్నాం. ఆ రోజుల్లో విధవ వివాహం సమర్ధనీయమే. కానీ మీరు అయిపు లేకుండా పోయారు. మీ తండ్రిగారు మీమీద నిప్పులు చెరిగారు. లలితని దూరంగా పెట్టి పురుడు పోశాం. ఆడపిల్ల పుట్టింది. చంద్రకళ అని పేరు పెట్టాం."

చక్రపాణి కేక పెట్టినంత పని చేశాడు.

"అంటే...అం...టే..." అతని కంఠం వణికింది. కాళ్లల్లో చెమ్మ తేలింది.

"అవును. చంద్రకళ లలితకి మీకు పుట్టిన పిల్ల. లలితకి పిల్లలు కాకుండానే పెళ్లిఅయిన ఏడాదికే తల చెడి పుట్టింటికి వచ్చింది. ఆమె అందం మిమ్మల్ని ఆకర్షించింది."

చక్రపాణి నిట్టూర్చాడు.

చెదిరిన స్వప్నలోకాల్లోకి చూస్తున్న కళ్లు అరమోడ్చి అన్నాడు.

"అవును. ఆమెని నేను నిజంగానే పెళ్లి చేసుకుందాం అనుకున్నాను. ఆమె లేలేత అందాలు నన్ను విచలితుణ్ని చేశాయి. ఇప్పటికి లలిత జ్ఞాపకాలు నా వెంటనే ఉన్నాయి. కానీ ఆ రోజుల్లో తండ్రిని ఎదిరించలేని పిరికితనం, ఆయన ఆంక్షలు నన్ను బంధించాయి. బలవంతాన నా మెడలు వంచి మా అక్క కూతురితో నా పెళ్లి జరిపించారు. విధవరాల్ని, సౌభాగ్యం లేనిదాన్ని పెళ్లి చేసుకోవటం ఏమిటి? అని నన్ను నిందించారు. ఆ తరువాత బలవంతాన అటు మళ్ళక తప్పలేదు. కానీ ఉద్యోగం కోసం వచ్చిన చంద్రకళని చూడగానే నాకు లలితే గుర్తుకు వచ్చింది. గుండెతోటలో నిదురించిన కోయిల గళం విప్పినట్లు అయ్యింది. లలిత అన్నయ్య...అదే మీ వారు మరణించి ఎంతకాలం అయ్యింది?" చేతిరుమాలుతో కళ్లు అద్దుకున్నాడు చక్రపాణి.

"ఎనిమిది సంవత్సరాలు అయ్యింది. మాకు పిల్లలు కలగ లేదు. లలిత ప్రసవించిన వెంటనే చనిపోయింది. ఆ పసిగుడ్డు నా ఒడిని చేరింది. చంద్రకళ అని నేనే పేరు పెట్టాను. ఎందుకో నాకా పేరంటే ఇష్టం. నా కడుపున పుట్టిన బిడ్డగానే పెంచాను. కానీ చంద్రకి ఇంతవరకు ఈ విషయం తెలియదు. దాని తల్లిని నేనే అనుకుంటుంది. అత్తని దానికి తెలవదు."

"అంటే...చంద్రకళ నా...కూ..." చక్రపాణి ఉద్విగ్నంగా చూశాడు.

"అవును. అది మీ ప్రేమగురుతు...! నన్ను చూస్తున్నారుగా. నా గుండెజబ్బు ముదిరిపోయింది. ఏ క్షణంలో ఈ ఊపిరి గాలిలో కలిసిపోతుందో. నే బతికిన్నాళ్లు పింఛన్ వస్తుంది. నేను పోతే రాదు. దానికి ఈలోగా ఏదన్నా ఉద్యోగం వస్తే దానికి ఒక బ్రతుకుతెరువు ఏర్పడుతుందని ఆశపడుతున్నాను. భగవంతుడు కరుణామయుడు. మీ వంటి సమర్థుడైన తండ్రి దగ్గరకే దాన్ని చేర్చాడు. ఇకనుంచి దాని బాధ్యత మీరు ఎలా తీసుకుంటారో లేక లలితని గాలిలో ఒదిలేసినట్లు చంద్రకళని దాని ఖర్మానికి..."

చక్రపాణి అడ్డుకుని..."వద్దు. దయచేసి అలా నిష్ఠూరంగా మాట్లాడకండి. గతంలో నేను చేసిన పొరపాటుకి, లలితకి నా వల్ల జరిగిన అన్యాయానికి ఈనాటి దాకా మానసికక్షోభ అనుభవిస్తూనే ఉన్నాను. నాకు ఇద్దరు కొడుకులు. ఆడపిల్లలు లేరు. చంద్రకళ నా కూతురే. ఈ సమాజం ముందు నిలబడి ఈమాట నేను పైకి చెప్పలేకపోవచ్చు. కానీ చంద్ర నా మానస పుత్రిక. తన గురించి మీరు దిగులు పడనక్కర్లేదు. నాకు డబ్బుకు లోటులేదు. ఆ అమ్మాయి జీవితానికి ఆలంబనగా నిలబడతాను. మంచి సంబంధం చూసి పెళ్లి చేస్తాను. నా బిడ్డలతో సమంగా ఆస్తి కూడా చంద్రకళ పేర్న రాస్తాను, ఆనాటి చక్రపాణి పిరికివాడు.

తండ్రి చాటువాడు. కానీ ఈనాటి చక్రపాణి ధైర్యవంతుడు. స్వతంత్రుడు."

అతడు ఆవేశంగా చెప్తుంటే వర్ధని కళ్లు చెమ్మగిల్లాయి.

"ఇప్పుడు నాకు నిశ్చింతగా వుంది. నేను ఆఖరిరోజుల్లో ఉన్నాను. నా చివరి ఘడియ దాకా దాన్ని నా దగ్గరే ఉండనివ్వండి. ఆ తరువాత దాని బాధ్యత మీది" అంది.



అంతలో గుమ్మం దగ్గర అలికిడి అయ్యింది.

ట్రేలో కాఫీ కప్పులు, బిస్కట్లు పట్టుకుని చంద్రకళ వసారాలోకి వచ్చింది.

ఆపేక్షగా ఆమె ముఖంలోకి చూస్తూ కాఫీ అందుకున్నాడు చక్రపాణి.

చంద్ర వయసు పందొమ్మిది సంవత్సరాలు.

మసిగుడ్డలో కట్టిన మాణిక్యంలా మెరుస్తుంది. లలిత కంటె చంద్రకళ అందం మిన్నగా ఉంది అనుకున్నాడు. పుత్రికా వాత్సల్యం అతనిలో పొంగిపొర్లింది. చంద్రకళ గబగబ తల్లిపక్కన కూర్చొని చెవిలో ఏదో చెప్పింది.

చక్రపాణి అన్నాడు— "ఆ రహస్యం పెద్దగా చెప్పినా ఫరవాలేదు. నేను నీకు పరాయివాణ్ణి కాను. మనకి చాలాదగ్గర బంధుత్వం వుంది. నేను నీకు తండ్రి వరస."

చంద్రకళ సిగ్గుపడుతుంటే వర్ధని అంది.

"దాని ఉద్యోగం గురించి మిమ్మల్ని అడగమంటుంది" అంది.

"నీకు ఉద్యోగమే కాదు కంపెనీ తరఫున ఫ్రీ క్వార్టర్స్ కూడా అలాట్ చేస్తున్నాను."

"ని...జ...మా సార్"

చక్రపాణి ప్రేమగా ఆమె తల మీద చెయ్యివేసి నిమిరాడు. పుట్టిన ఇరవై ఏళ్లకి పుత్రికా వాత్సల్యాన్ని చవిచూస్తున్న అనుభూతి వర్ణించతరమా? మధురానుభూతుల్ని చవిచూసిన అలనాటి ప్రేయసి కళ్ల ముందు కదులుతూంటే కుర్చీలోంచి లేచాడు.

"చంద్రా! మంచిరోజు చూసుకొని ఉద్యోగంలో చేరు. తొందరలో మీకు క్వార్టర్స్ కూడా అలాట్ చేయిస్తాను" అంటూ గబగబా గేటు తెరుచుకొని కారు దగ్గరికి వచ్చాడు. ఆయన్ని సాగనంపటానికి చంద్రకళ కూడా కారు దాకా వెళ్లింది.


తల్లి తప్పించి నా అనుకున్నవారు లేకుండా బతుకుతున్న తనకు పెద్ద వ్యాపారి బంధువు అని తెలియగానే ఆమెలో ఎంతో నూతనోత్సాహం వచ్చింది.

చంద్రకళ చేతిని పట్టుకుని ఆయన కారు దగ్గరకి వెడుతుంటే వర్ధని కళ్లనిండా నీళ్లు నిండాయి.

గోడకి తగిలించిన చచ్చిపోయిన ఆడపడుచు లలిత ఫోటోకి నమస్కరిస్తూ అనుకుంది. 'అమ్మా! లలిత. పరువు ప్రతిష్ఠ అంటూ నిన్ను దూరంగా తీసుకెళ్లి నోట పసరుమందు పోయించి బలవంతాన నీకు గర్భస్రావం చేయించాం. అది వికటించి చివరికి నీ ప్రాణాన్ని తీసింది తల్లి. నిజానికి చంద్రకళ నా కూతురే అయినా ఆపద్ధర్మంగా నీ కూతురు అని నీ ప్రియుడికి అబద్ధం చెప్పాను. నేను లేకపోయినా దానికి ఒక గొప్ప అండ దొరుకుతుందని తల్లిగా తాపత్రయ పడ్డాను. లలిత నా కూతురే అయినా మేనత్త పోలిక రావటం దాని అదృష్టం" నన్ను మన్నించు లలితా! అంటూ ఆడపడచు లలిత ఫోటోకు నమస్కరిస్తూ కన్నీటిని వాళి అర్పించింది వర్ధని.

# 'తబలా'ధ్యుడు

ఏకబిగిన 21 గంటల్ల పాటు తబలా వాయించిన రింకూ ఆదర్శ్ ఇటీవలే గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించాడు. జపాన్‌కు చెందిన లియో ఫెర్నాండెజ్ గతంలో డ్రమ్స్‌ను ఏకబిగిన 20 గంటల పాటు వాయించి నెలకొల్పిన ప్రపంచ రికార్డును ఆదర్శ్ ఇప్పుడు బద్దలుకొట్టాడు. న్యూఢిల్లీలోని కన్నాట్‌ప్లేస్ సెంట్రల్ పార్కులో గత మార్చిలో ఆదర్శ్ తన తబలా వాద్య ప్రదర్శన నిర్వహించాడు. 18 గంటల పాటు జాజ్ వాయించిన అమెరికాకు చెందిన స్టీవ్ స్టీవెన్‌సన్ ప్రస్తుత రికార్డును కూడా ఆదర్శ్ బద్దలు కొట్టినట్టే. తాను మూడేళ్ళ వయస్సు నుంచే తబలా వాయిస్తున్నానని, సంగీత అన్వేషణాభిలాషతో తాను యూరోప్‌లో ఓ మెడికల్ కాలేజీలో వచ్చిన సీటును కూడా వదిలేశానని 29 ఏళ్ళ ఆదర్శ్ చెబుతాడు. సంగీతంలో కొత్తవారికి ప్రోత్సాహం కల్పించేందుకు



బీహార్, ఉత్తరప్రదేశ్‌లలో అఖిలభారత సంగీతం పోటీలు కూడా నిర్వహించినట్లు ఆదర్శ్ పేర్కొన్నాడు. బెనారస్ ఘరానాకు చెందిన దివంగత గొడై మహరాజ్ నాలుగున్నర గంటలపాటు తబలా వాయించి నెలకొల్పిన 'జాతీయ రికార్డును' ఆదర్శ్ 1997లో ఐదుగంటలు వాయించి అధిగమించాడు. సినిమాలకు 'శ్రావ్యమైన సంగీతం' అందించడం తన ధ్యేయం అని ఆదర్శ్ అంటాడు. రమేశ్‌సిప్పీ నిర్మించే 'షోలే' చిత్రం ద్వితీయ భాగానికి ఆదర్శ్ సంగీత దర్శకత్వం వహిస్తున్నాడు. లక్నో ఘరానాకు చెందిన పండిట్ గంగాదయాల్ పాండే వద్ద, పంజాబ్ ఘరానాకు చెందిన ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఉస్తాద్ అల్లా రఖా వద్ద తాను తబలా నేర్చుకున్నానని ఆదర్శ్ చెప్తాడు.

-వియ్యార్కె దొడ్డా